క్లుప్తంగా

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

గరుగుబిల్లి: విద్యార్థులంతా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులతో పలు కథల పుస్తకాలు చదివించిన ఆయన ఓ పుస్తకాన్ని ఏ విధంగా చదివి అందులోని విషయం అర్థం చేసుకోవాలో తెలిపారు. పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం కలుగుతుందని, అందరూ ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేయాలని కోరారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కోటదుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

కురుపాం: స్థానిక గౌడువీధికి చెందిన వారంతా కోటదుర్గమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏటా దసరా ముందు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. డప్పువాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా కోటదుర్గమ్మ గుడికి వెళ్లిన భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

ముగిసిన పరీక్షలు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం జరిగిన పరీక్షలకు 80 మంది హాజరుకావాల్సి ఉండగా, 72 మంది హాజరయ్యారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని తెలగావీధిలో బాల సరస్వతి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. వినాయక ఉత్సవాల నేపథ్యంలో నిర్వహించిన అన్నసంతర్పణలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

నేడు సీజ్‌చేసిన వాహనాల వేలం

సాలూరు: పట్టణంలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్రవాహనాలు, రెండు ఫోర్ వీలర్స్‌కు సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.ఆసక్తి గల వారు ఈ బహిరంగ వేలంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాలు



బాగువలసలో జరుగుతున్న వారాలు

సాలూరు: మండలంలోని బాగువలస, బోరబంద, దేవుబుచ్చింపేట, వల్లాపురం తదితర గ్రామాల్లో దేశమ్మతల్లి వారాలు ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బస్సు కోసం మహిళల నిరీక్షణ

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న చినభోగిలి జంక్షన్ వద్ద మహిళలు బస్సుల కోసం ఆదివారం గంటన్నర సేపు మండుటెండలో నిరీక్షించాల్సి వచ్చింది. దుగ్గేరు, మక్కువ ప్రాంతాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లవలసిన మహిళలు చినభోగిలి జంక్షన్ వద్ద బస్సు మారాల్సి ఉండగా వారంతా ఉదయం జంక్షన్‌కు చేరుకోగా రాకపోకలు సాగిస్తున్న బస్సుల్లో మహిళా ప్రయాణికులకు టికెట్లు ఇవ్వడానికి స్టాపులవద్ద బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్నాయని, దీంతో బస్సులు ఇక్కడ ఎక్కడానికి అవస్థలు పడ్డామని మహిళలు వాపోయారు.

యంత్రాలతో పూడికతీత, పారిశుధ్య పనులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో కాలువల్లో పూడిక తీతపనులు, వీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో చిరుజల్లులు కురుస్తున్న కారణంగా వివి ధ కారణాల వల్ల ప్రజలు జ్వరాల బారిన పడుతు న్న సందర్భంగా తీసుకుంటున్న ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా సర్పంచ్‌లు జె.తేరేజమ్మ, బొన్నాడ అన్నపూర్ణమ్మల ఆధ్వర్యంలో పెదభోగిలి, హడ్కోకాలనీ, సీతానగరం, గాదెలవలస గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు యంత్రాలతో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయించడం, వీధుల్లో పారిశుధ్య పనులు చేయించినట్లు చెప్పారు.

'గాలికుంటు'పై నిర్లక్ష్యం వద్దు..



ఆరుబయట మేత మేస్తున్న పశువులు

- పశువులకు గాలికుంటు వ్యాధి ముప్పు
- వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి
- ఈ నెల 15 నుంచి వ్యాక్సినేషన్

గుమ్మలక్ష్మీపురం: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి(ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) అత్యంత ప్రమాదకరం. పాడిరైతులు, పశుపోషకులు అప్రమత్తం కావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే అన్నివిధాలా నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అజాగ్రత్త కారణంగా వ్యాధి సోకే పశువులు ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా వ్యాధికి గురైన పశువుల్లో పాలదిగుబడి తగ్గిపోవడంతో పాటు పనిచేసే సామర్థ్యం కూడా గణనీయంగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల(అక్టోబరు) 15వ తేదీ వరకు నెల రోజుల పాటు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. వ్యాధి రాకుండా ముందస్తు నివారణ చర్యగా టీకాలు వేయనున్నారు. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన దూడలు కూడా చనిపోయే అవకాశం ఉంది. పిక్కోర్నావిరిడే అనే వైరస్ కలిగే ఈ వ్యాధి.. అంటు వ్యాధి కావున వ్యాధి సోకిన వాటిని మిగతా మూగజీవాల నుంచి దూరంగా ఉంచాలి.

-వ్యాధి లక్షణాలివే..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం వస్తుంది. నోటి లోపల, నాలుక, చిగుళ్లు, పెదవులపై నీటిపొక్కులు ఏర్పడతాయి. ఇవి పగిలి పుండ్లుగా కూడా మారుతాయి. ఈ కారణంగా అవి మేత తినడానికి ఇబ్బంది పడతాయి. పశువుల పాదాలు, కాలిగిట్టల మధ్య నీటిపొక్కులుగా ఏర్పడి అవి పగిలి పుండ్లు అవ్వడంతో నడవడానికి ఇబ్బంది పడతాయి. దీనివల్లే పశువులు కుంటుతూ నడుస్తాయి. అందుకే ఈ వ్యాధిని గాలికుంటు వ్యాధి అని పిలుస్తారు. నోట్లో కూడా పుండ్లు ఏర్పడడం వల్ల చొంగ కారుస్తాయి.

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి..

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణపై పాడిరైతులు అప్రమత్తం కావాలి. జాగ్రత్త పడితేనే పశువులను రక్షించుకోగలం. వ్యాధి రాకుండా ముందస్తుంగా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నాం. ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి. డెంకాడ, అక్కివరం, రఘుమండ గ్రామాలు కేంద్రంగా వ్యాక్సినేషన్ చేపడుతున్నాం. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-పి.లక్ష్మణరావు, పశువైద్యాధికారి, గుమ్మలక్ష్మీపురం

-ఇలా వ్యాప్తి చెందుతుంది..

కలుషితమైన మేత, నీరు, పరికరాల ద్వారా ఈ గాలికుంటు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువుల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులకు ఇది నేరుగా వ్యాపిస్తుంది. అంతేకాకుండా గాలి ద్వారా కూడా ఈ వైరస్ కొంతదూరం వరకు వ్యాపిస్తుంది.

చికిత్స, నివారణ ఇలా..

గాలికుంటు వ్యాధి నివారణకు నిర్దిష్టమైన చికిత్స లేదు. సాధారణంగా వ్యాధి లక్షణాల ఆధారంగానే చికిత్స చేయాల్సి ఉంటుంది. పుండ్లు కారణంగా ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండేందుకు యాంటీబయాటిక్స్ ఉపయోగించవచ్చు. నోట్లోని పుండ్లను శుభ్రం చేయడానికి పొటాషియం పర్మాంగనేట్ వంటి ద్రావణం ఉపయోగించాలి. పాదాల పుండ్లకు అయోడిన్ లేదా ఇతర యాంటీసెప్టిక్ ద్రావణం వాడొచ్చు. అయితే ఈ వ్యాధి రాకుండా ఉండడానికి ముందస్తుగా టీకాలు వేయడం ముఖ్యం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ టీకాలు వేయించాలి. అలాగే పశువులు ఉండే స్థలాలను శుభ్రంగా ఉంచాలి.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం



చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుత కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 15 నెలల కాలం గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్ల వయసు దాటిన బీసీలకు పింఛన్లు వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన, బీజేపీలు జతకట్టి వచ్చినా రాష్ట్రానికి గానీ రాష్ట్ర ప్రజానీకానికి గానీ ఒరిగిందేమీ లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వల్ల ప్రతి వర్గానికి అన్యాయం జరుగుతోందన్నారు. ఎక్కడ చూసినా ప్రశాంత వాతావరణం లేదన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా రైతుల ఆక్రందనే కనిపిస్తోందన్నారు. యూరియా కోసం రోడ్డెక్కి వారు నిరసనలు చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు.

జ్వరాల బారినపడకుండా జాగ్రత్త వహించాలి

గరుగుబిల్లి: వర్షాకాలంలో వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వాటి బారినపడకుండా జాగ్రత్త వహించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎం.కె.తిరుమలప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు. ఎవరైనా అనారోగ్యం బారినపడితే వెంటనే ఆస్పత్రికి వెళ్లి, చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితుల్లో అందుబాటులోని స్థానిక వైద్యులతో ప్రథమ చికిత్స చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా వానాకాలంలో అతిసార వ్యాధితో పాటు దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు వస్తాయని వాటి బారినపడకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

సాగునీటికి ఎదురుచూపులు

భామిని: మండలంలోని బత్తిలి, మనుమకొండ, పాలవలస, కాట్రగడ, వడ్డంగి, బొమ్మిక ప్రాంతాలకు చెందిన సుమారు 2500 ఎకరాల భూములకు సాగునీరు అందించాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు. భూములకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన ఎత్తిపోతల పథకం ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. మనుమకొండ వద్ద వెత్రిగెడ్డపై మినీడ్యామ్ గాని, వంశధార నదిపై ఎత్తిపోతల పథకం గాని ఏర్పాటు చేస్తే వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



బత్తిలి వద్ద దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ శిలాఫలకం

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు



జియ్యమ్మవలస మండలంలోని తురకనాయుడువలస గ్రామ పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. పొలంగట్టుపైనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా, దాని కింద సిమెంట్ దిమ్మ గానీ దాని చుట్టూ రక్షణ కంచె కూడా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు అక్కడి స్తంభాలు కూడా ఒకవైపు ఒరిగిపోయాయని అవెప్పుడు పడిపోతాయోనన్న భయం నెలకొందంటున్నారు. కొన్నేళ్లుగా ఇదే సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -జియ్యమ్మవలస రూరల్

ఏనుగులు తరలించి పంటలు రక్షించండి

- ప్రభుత్వానికి కొమరాడ మండల రైతుల విజ్ఞప్తి

కొమరాడ: ఏనుగులు తరలించి, తమ పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట గజరాజుల పాలవుతోందని, తామంతా నష్టపోతున్నామని వాపోతున్నారు. అధికారంలోకి రాగానే మండలంలో పలుచోట్ల తిష్టవేసిన ఏనుగులను తరలిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదంటున్నారు. కనీసం పంట నష్టపరిహారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా కొమరాడ మండలంలోని కళ్లికోట, దుగ్గి, గుణానపురం, గుమడ, కోటిపాం ప్రాంతాల్లో..మూడు రోజుల క్రితం వరకు కందివలస, రాజ్యలక్ష్మీపురం, కుమ్మరిగుంట తదితర గ్రామాల్లో తొమ్మిది ఏనుగుల గుంపు సంచరిస్తూ వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలను తొక్కి ధ్వంసం చేశాయని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. అటవీ శాఖ అధికారులు కూడా తూతూమంత్రంగానే చర్యలు చేపడుతున్నారు తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదంటున్నారు. ఇప్పటికైనా తమ బాధలు దృష్టిలో ఉంచుకుని, ఇక్కడి ఏనుగులను తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రాజ్యలక్ష్మీపురంలో ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

మా ఆరోగ్యానికి రక్షణ లేదా..?



చెత్తను డంపింగ్ చేస్తున్న బత్తులవాని చెరువు వద్ద సమస్య వివరిస్తున్న బాధితులు

పాలకొండ రూరల్: పట్టణంలో శాశ్వత డంపింగ్‌యార్డు లేకపోవడంతో నగర పంచాయతీలో సేకరించిన వ్యర్థాలను పాలకొండ - ఓని గ్రామాల మధ్య ఉన్న బత్తులవాని చెరువులో డంప్ చేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే గ్రామీణ ప్రజలతోపాటు సమీపంలో ఉన్న జగనన్న కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెరువు గర్భంలో చెత్త వేయడంతో సాగు, ఇతర అవసరాలకు నీటిని వినియోగించలేని పరిస్థితి నెలకొంది. అలాగే చెరువు రూపు కోల్పోతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోందని.. అలాగే ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మా ఆరోగ్యానికి రక్షణ లేదా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి వేరే ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలని ఓని గ్రామానికి చెందిన కె.కార్తీక్, వికాస్, సాయి, లక్ష్మి, తదితరులు కోరారు.

పరామర్శ

జియ్యమ్మవలస: నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పోలా గోవిందరావు సోదరుడు పోల రామకృష్ణనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి పెదమేరంగి వెళ్లి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఇటుక గ్రామం వెళ్లి మృతి చెందిన సూరారపు తాతబాబునాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, సర్పంచ్ టి.గౌరవం దొర పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లతో రైతుల ఆందోళన

సీతానగరం: మండలంలోని పొలాల్లో వరి చేలకు సోకుతున్న తెగుళ్లతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మడులలో వరిచేలు ఏపుగా పెరడం వల్ల పెట్టుబడికి తగిన పంట ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన రైతులు వరిలో ఆశించే తెగుళ్లు చూసి దిగాలు పడుతున్నారు. వరిలో కుళ్ల తెగులు, ఆకు ముడత తెగులు,కాండం తొలుచు తెగులు సోకడం వల్ల ఏపుగా పెరుగుతున్న వరిచేను పంటను చూసి ఆందోళనగా ఉందని వాపోతున్నారు.

గ్రామాల్లో ఘనంగా వారాల పండుగలు



మొక్కులు తీర్చుకునేందుకు ప్రసాదాలు, డప్పులతో వనంగుడికి వెళ్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో వారాలు, కలగొప్పుల పండుగలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభించిన వ్యవసాయ పనులు అమ్మవార్ల ఆశీస్సులతో నిర్విఘ్నంగా వరిఉభాలు, వరివెదలు, పత్తి, జొన్నపంటల సాగు జరిగాయన్న నమ్మకంతో పెదభోగిలి, మెట్టువీధి, గూడెం, సుంకరివీధి, సీతా నగరం, బుడ్డిపేట గ్రామాల్లో వారాల పండగ నిర్వహించగా, కృష్ణారాయపు రం, పెదంకలాం, సుమిత్రాపురం,వెంకటాపురం, తామరఖండి దయానిధిపు రం తదితర గ్రామాల్లో రైతులు, వృత్తిదారులు కలగొప్పులు పేరుతో అమ్మవార్ల ఆశీస్సుల కోసం మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆదివారం ఉదయం డప్పులు, సన్నాయిమేళం, హారతులు, వడపప్పు, చీరలు, పసుపు కుంకాలు, ప్రసాదాలతో అమ్మవారి పూనకంతో ఉన్న మహిళలతో ఊరేగింపుగా వీధుల్లో జానపద కళాకారుల విన్యాసాలతో వనంగుడికి వెళ్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

గాడిచర్లకు నివాళులు..



గాడిచర్లకు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు తదితరులు

పాలకొండ రూరల్: గ్రంథాలయ ఉద్యమసమయంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు అందించిన సేవలు వెలకట్టలేనివని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గ్రంథాలయంలో గాడిచర్ల జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ గణేష్‌బాబు మాట్లాడుతూ.. 1906లో విజ్ఞానచంద్రికా గ్రంథమండలి నిర్వహణకు హరిసర్వోత్తమరావు అందించిన తోడ్పాటును వివరించారు. వందేమాతరం, జాతీయ ఉద్యమాల్లో గాడిచర్ల పాత్ర శ్లాఘనీయమని చెప్పారు. 1934లో ఏపీ గ్రంథాలయ సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరించి వయోజన విద్యా కేంద్రాలను స్థాపించిన మొట్టమొదటి వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఐక్యవేదిక కన్వీనర్ నూతుల పాటి భరత్‌భూషణ్, కౌన్సిలర్ భాసూరు కాంతారావు, సచివాలయ సిబ్బంది షణ్ముఖరావు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి పథకం ఎప్పుడు అమలు చేస్తారు?



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు రాధిక

గుమ్మలక్ష్మీపురం: సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఆడబిడ్డ నిధి పథకం ఎప్పుడు అమలు చేస్తారని జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదే విషయమై ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయలేకపోయిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లోని మూడు, నాలుగు పథకాలు అరకొరగా అమలు చేసేసి చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారని, 50 ఏళ్ల వయసు దాటిన బీసీలకు పింఛన్ అందిస్తామన్నారని ఇవన్నీ ఎప్పుడిస్తారని నిలదీశారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నికల హామీలన్నీ అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని లేకుంటే ప్రజాగ్రహం చూడాల్సి వస్తుందన్నారు.

మౌలిక వసతులపై దృష్టి

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరులో మౌలిక వసతుల కల్పనపై సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండలాధ్యక్షుడు టి.ఉపేంద్రకుమార్ దృష్టి సారించారు. పంచాయతీ పరిధిలో వారాలు ప్రకటించటంతో పారిశుధ్య లోపాలను సరి చేయడంతో పాటు తాగునీటి ఇబ్బందుల్లేకుండా వీధి బోర్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. అలాగే వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద మురుగునీటి నివారణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 15వ ఆర్థిక సంఘ నిధులు పంచాయతీకి జమ కాలేదన్నారు. అధికారులు స్పందించి నిధులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



తాగునీటి బోరుకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

అన్నదాతలను ఆదుకోవాలి



తంపటాపల్లిలో నీట మునిగిన వరి పంటను చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

పాలకొండ రూరల్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని వరి పంట పొలాలు నీట మునిగాయి. ముఖ్యంగా మండల పరిధిలోని తంపటాపల్లి చుట్టుపక్కల ఉన్న తంపర, చిట్ట, రావాడ గెడ్డలు పొంగి పొర్లడంతో పాటు మడ్డువలస రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో పొలాలు మునిగిపోయినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు అల్లు సురేష్‌కుమార్ సదరు రైతులతో కలసి ముంపునకు గురైన పొలాలను ఆదివారం పరిశీలించారు.

జంపరకోట, నవగాం గెడ్డలతో పాటు మండలంలో మరికొన్ని చోట్ల జలవనరులు పొంగడంతో వరి పొలాల్లో నీరు చేరిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి రైతులను ఆదుకోవాలన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక పోటీలు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అండర్-17 బాల, బాలికల డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించనున్నట్లు పాలకొండ డివిజన్ క్రీడా పర్యవేక్షకుడు నెల్లి వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి విజేతలు ఏడు విభాగాల్లో తలపడతారని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 17న విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం పరిధిలో రేగిడి మండల జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా అండర్-14 స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు జరగనున్నాయన్నారు.

పెట్రోల్ విక్రయాలు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్...

సీతంపేట: స్థానిక ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్లో ఆదివారం నుంచి పెట్రోల్ విక్రయాలు ప్రారంభమయ్యాయి. 'ఐటీడీఏ బంక్‌లో పెట్రోల్ నిల్' శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.



బంక్‌లో పెట్రోల్ విక్రయిస్తున్న సిబ్బంది

ర్యాలీని విజయవంతం చేయండి

కురుపాం: మండల పరిధిలోని నీలకంఠాపురాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామంలో చేపట్టే ర్యాలీని విజయవంతం చేయాలని మండల వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, మాజీ ఎంపీపీ హిమరిక నీలకంఠేశ్వరరావు పిలుపునిచ్చారు. తూర్పుముఠా వైపు ఉన్న 12 పంచాయతీలకు చెందిన ప్రజలంతా ఈ ర్యాలీలో పాల్గొని, ఐక్యతను చాటాలని కోరారు.